క్లుప్తంగా

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అడ్డతీగల: మండల కేంద్రంలోని సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న సమావేశంలో 2022 మార్చి నుంచి 2023 మార్చి 31 వరకూ మండల వ్యాప్తంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలచే సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు తెలిపారు. తుది నివేదికను సమర్పించడానికి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సమస్యలు ఉన్న వారితో పాటు ఉపాధిహామీ విభాగం అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన ప్రకటనలో కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పోతవరం ఎంపీపీ పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

దేవీపట్నం: పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులను ఎంఈవో వై. మల్లేశ్వరరావు పరిశీలించారు. దేవారం పంచాయతీలోని పోతవరం, చిన్నారిగండి గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో భాగంగా చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణం, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిఫికేషన్ తదితర పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను అనుసరించి పనులు చేపట్టి విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. సీఆర్పీ శ్రీనివాస్‌దొర, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

అనకాపల్లి రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో భూమికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్ లచ్చన్న తెలిపారు. సోమవారం సీతానగరంలో అనకాపల్లి, కశింకోట మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన రైతులకు 6400 విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోందన్నారు. ఈ విధానం ద్వారా సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు రసాయనరహిత, ఆరోగ్యకరమైన పంటలులుగా పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ఎన్నో రాయితీలిస్తూ, ప్రోత్సహిస్తోందన్నారు. విత్తనాల కిట్లలో నవధాన్యాల సాగుకు సంబంధించిన విత్తనాలతో పాటు 30 రకాలున్నట్టు వెల్లడించారు. ప్రతి ఇంట్లో పెరటి సాగు ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చని సూచించారు. ఈ తరహా వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఘన, ద్రవ జీవామృతం తయారీ, కషాయాల తయారీ గురించి వివరించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటలాడుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, క్విజ్, డ్రాయింగ్, వ్యాయామం ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ముంచంగిపుట్టు: మండల గిరిజన సంఘం నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా నారాయణ, రాందాస్, ప్రధాన కార్యదర్శిగా నరసయ్య, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణతో పాటు 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. పలువురు మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ కె.త్రినాథ్, సీపీఎం నేత భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాలయాలు



చింతూరులోని గ్రామ సచివాలయ కేంద్రం

- ప్రజల చెంతకే అందుతున్న ప్రభుత్వ సేవలు
- పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి
- సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ

చింతూరు: ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజా సేవలకు చేరువవుతున్నాయి. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా అమలు చేస్తున్న ఈ వ్యవస్థ ప్రారంభమై నాలుగేళ్లు దాటింది. చింతూరు డివిజన్‌లో చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలుండగా 46 సచివాలయ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 343 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయాల ద్వారా 500కు పైగా ప్రభుత్వ సర్వీసులు అందుబాటులో ఉండగా వీటి సేవలను ప్రజలకు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

పటిష్టంగా అమలయ్యేలా

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు పక్కాగా అందించేందుకు సచివాలయ సేవలను పటిష్టంగా అమలు చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వివిధ చర్యలు తీసుకోవడం, వ్యవస్థ తీరుపై వివరాలు సేకరించడం, సిబ్బంది పనితీరుపై దృష్టి సారించడం ప్రధానమైనవి. సిబ్బంది ఎలాంటి అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విధుల్లో అలసత్వం వహించకుండా నిత్యం అధికారుల పర్యవేక్షణ వుండేలా చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇలా

సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లు కచ్చితంగా కార్యాలయం ఎదుట ప్రదర్శించాలి. అన్ని రకాల సేవలకు సంబంధించిన బోర్డులు అందుబాటులో ఉంచాలి. పథకాలకు సంబంధించిన అర్హులు, అనర్హుల జాబితాను ఎప్పటికప్పుడు ప్రచురించాలి. రికార్డులు, మూమెంటు రిజిస్టర్లు సక్రమంగా ఉండడంతో పాటు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. త్వరితగతిన వాటిని పూర్తి చేసి దరఖాస్తుదారులకు అందచేయాలి. సిబ్బంది డ్రెస్‌కోడ్‌తో పాటు హాజరు, వారి పనితీరు, పథకాలు, జాబ్‌చార్ట్‌పై అవగాహన తదితర విషయాలపై అధికారులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. వీటి పర్యవేక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక బృందాన్ని కూడా నియమించింది. సచివాలయ సేవలు పటిష్టంగా అమలు చేసేందుకు మండలస్థాయి అధికారులు సచివాలయ సిబ్బందితో తరచూ సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు చేస్తున్నారు.

ఎటపాక డివిజన్‌లో సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాలు	సిబ్బంది సంఖ్య
ఎటపాక	14	106
చింతూరు	13	94
కూనవరం	11	83
వీఆర్‌పురం	08	60
మొత్తం	46	343

పనితీరుకు ప్రాధాన్యం



సచివాలయ వ్యవస్థ బలోపేతం సిబ్బంది పనితీరుపైనే ఆధారపడి వుంది. దీనిలో ప్రధానంగా కార్యదర్శుల పనితీరు ఎంతో కీలకమైంది. ప్రతి వుద్యోగి సక్రమంగా విధులు నిర్వహించేందుకు సీజన్, ఏడాది వారీగా వర్క్ క్యాలెండర్ ఇవ్వడం జరిగింది. పనితీరుకు ప్రాధాన్యం. – వెంకటరత్నం, ఎంపీడీవో, చింతూరు మండలం

పనుల్లో నాణ్యత తప్పనిసరి

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తి, డి.పోలవరం, అనుకులపాలెం, రాయపల్లి, డి.రామవరం గ్రామాల్లోని పాఠశాలల వద్ద జరుగుతున్న నాడు-నేడు ఫేస్-2 భవన నిర్మాణ పనులను ఎంపీడీవో కె.బాపన్నదొర సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మండల స్థాయి అధికారులను నాడు-నేడు పనుల పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పనుల తీరుని పరిశీలిస్తున్నామన్నారు. నిబంధనల మేరకు నిర్మాణ పనుల్లో సూచించిన మెటీరియల్‌ని మాత్రమే వినియోగించి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. నాడు-నేడు పనుల తనిఖీలో భాగంగా రాయపల్లి ఎంపీపీ పాఠశాల హెచ్ఎం విధులకు గైర్హాజరైనట్టు తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామ సచివాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరుని పర్యవేక్షించామన్నారు.



రాయపల్లిలోని ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అల్లూరి క్రికెట్ టోర్నీ ప్రారంభం

కొయ్యూరు: స్థానిక పోలీసు గ్రౌండ్‌లో చిరంజీవి, వేణు, నూకరాజు(సీపీఎన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు క్రికెట్ పోటీలను సోమవారం తహసీల్దార్ తిరుమలరావు బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.ఎస్. ప్రసాద్, అనిసెట్టి చిరంజీవి కలిసి మొదటి బహుమతిగా రూ.50వేలను విజేత జట్టుకు అందజేయనున్నారు. ద్వితీయ బహుమతిగా రూ.25 వేలను ఆశ్రమ పాఠశాల పీడీ, కుస్తీ అకాడమీ కోచ్ అంబటి నూకరాజు అందజేయనున్నట్టు ప్రకటించారు. పోటీల్లో వాటర్ ప్యాకెట్లను భగ్గు దుర్గాప్రసాద్ అందజేస్తున్నారు. మండల ఉపాధ్యక్షురాలు అంబటి నూకాలు, ఎంపీడీవో మేరీరోజ్, చీడిపాలెం, రాజేంద్రపాలెం, కొయ్యూరు సర్పంచ్‌లు నత్తూరు సోమన్నదొర, పీటా సింహాచలం, మాకాడ బాలరాజు, నిర్వాహకులు సురబోయిన శ్రావణ్ కుమార్, రామకృష్ణ, జంపా సురేశ్, బల్లా ప్రసాద్, వాణి ప్రకాష్, నగేశ్, లవకుశ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న తహసీల్దార్ తిరుమలరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను అభినందిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ తదితరులు

గంగవరం : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని తహసీల్దార్ శ్రీమన్నారాయణ అన్నారు. గ్రామాల్లో నిర్వహించే క్రీడా కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న కలుముల కామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నీ సోమవారం నాటికి పదవ రోజుకు చేరుకుంది. దేవీపట్నం గోదావరి స్టార్స్, అడ్డతీగల రఘుకైట్స్ జట్ల మధ్య హోరా హోరీ మ్యాచ్ జరిగింది. రఘు కైట్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌ను తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంఆర్ఐ ఫయాజ్ భాషా(జిలానీ) మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులను అభినందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన ప్రసాద్‌కు మెడల్, జ్ఞాపికను బహుకరించారు. టోర్నీ విజయవంతంగా సాగాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్, నెల్లిపూడి ఎంపీపీ స్కూల్ హెచ్ఎం.రాంబాబు, గంగవరం యువసేన యువకులు అనిల్, శివ, స్వామి, గోపి, విఠల్, పోతురాజు, అనంత్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ ప్రారంభం



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఎటపాక: నెల్లిపాక పీహెచ్‌సీ పరిధి రాయనపేట సచివాలయం వద్ద పాతకొండేపల్లిలో దోమల మందు పిచికారీ సోమవారం ప్రారంభించారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సర్పంచ్ అలివేలు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామికి ప్రత్యేక పూజలు

కొంకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శంకరం, చిదంబరం, కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వహించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన



యువతకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు

అరకులోయ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింత చైతన్యం కల్పించాలని నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు చెప్పారు. మండల కేంద్రంలోని నేచర్ సంస్థ కార్యాలయంలో గన్నేల, బొండం పంచాయతీలకు చెందిన 100 మంది యువతీ, యువకులకు సోమవారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కోసం ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలకు చెందిన గిరిజన యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండలంలో అన్ని పంచాయతీల పరిధిలో సంస్థ వలంటీర్లుగా నియమిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవయ్యేలా నేచర్ సంస్థ ప్రతినిధులు చూడాలన్నారు. సంస్థ కో-ఆర్డినేటర్ గౌరిశంకర్, సంస్థ సిబ్బంది ప్రసాద్, అద్దు, సంతోష్ కుమార్, శైలు తదితరులు పాల్గొన్నారు.

సంతకు తప్పని చింత

- రోడ్డుపై దుకాణాలు
- నిరుపయోగంగా షెడ్లు



అరకు-విశాఖ ప్రధాన రహదారిపై సంత దుకాణాలు

అనంతగిరి: మండల కేంద్రంలోని సోమవారం జరుగుతున్న వారపు సంత సమస్యల చింతగా మారింది. అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని సంత జరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని భయపడుతున్నారు. సంత షెడ్లు ఉన్నా వ్యాపారులు రహదారిపైనే దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారని, నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. సంత సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. సంత షెడ్లలో దుకాణాలను ఏర్పాటుకుని, వ్యాపారులు సాగించే విధంగా అధికారులు కృషి చేయాలని వారు కోరుతున్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు జయ

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయ మాట్లాడుతూ భారత మహిళా రెజ్లర్లపై లైంగి క వేధింపులక పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలో మహిళా రెజ్లర్లు తమ న్యాయం కోసం నెలల తరబడి నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భారత ఖ్యాతిని ప్రపంచమంతా చాటుతున్న మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా చట్టాలు, హక్కులను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు శశికళ, భాగ్యవతి, సంతోష్, విజయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గిరి బాలల నేస్తం కార్యక్రమాన్ని ఆసరా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విజ్ఞానం, వినోదంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ బాలలు విజ్ఞాన శక్తి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు 15రోజులపాటు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, సీపీఎం, గిరిజన సంఘం నాయకులు భీమరాజు, ఈశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గౌరీపరమేశ్వరుల వేడుకలు

అనకాపల్లిటౌన్ : గత రెండు రోజులుగా జరుగుతున్న స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.